## క్లుప్తంగా

### నేడు కార్యకర్తల సమావేశం

వీరపునాయునిపల్లె: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, కమలాపురం నియోజకవర్గం ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి హాజరుకానున్నట్లు ఆయన తెలియజేశారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

### మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గురుమోహన్‌రెడ్డి, విజయలక్ష్మి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని అంబకపల్లి రోడ్డులో ఉన్న విద్యుత్ కార్యాలయం ఎదుట సోమవారం పులివెందుల విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రాన్ని విద్యుత్ శాఖ ఏడీ గురుమోహన్‌రెడ్డి, ఏఈ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని, ఈ నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ తగిలి ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సేవా సంస్థ తాగేందుకు మంచినీటితోపాటు మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు జగన్మోహన్ రెడ్డి, అశోక్ బాబు, దామోదర్, సుధాకర్ రెడ్డి, బేగం, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పాలీసెట్ మెటీరియల్స్ పంపిణీ



విద్యార్థులకు మెటీరియల్స్ పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ తాతాజీ

సింహాద్రిపురం : మండల కేంద్రమైన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ ఉచితంగా పాలీసెట్ మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలీసెట్ పరీక్ష రాసే విద్యార్థులు ఈ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులకు ఉచిత పాలీసెట్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### పాఠశాలకు రూ. 50వేలు వితరణ

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రహరీకి దేశ నాయకులు, శాస్త్రవేత్తలు సంఘసంస్కర్తలు, సమాజ సేవకుల చిత్ర పటాల గీయించడానికి బోయపల్లి ప్రసాద్‌రెడ్డి, కుమారుడు కార్తీక్‌రెడ్డి రూ.50 నగదును అందించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయరెడ్డి తెలిపారు. సోమవారం దాత కార్తీక్‌రెడ్డి పాఠశాలకు వచ్చిన సందర్భంగా అడిగిన వెంటనే ఈ సాయం అందించారని ఆయన తెలిపారు. ఈ పాఠశాల అభివృద్ధికి ఎంతో మంది పూర్వ విద్యార్థులు దాతలు, సహాయ, సహకారాలు అందిస్తున్నారని ఆయన కొనియాడారు.

### సరస్వతిదేవి విగ్రహం ఏర్పాటు



సరస్వతిదేవి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న పూర్వ విద్యార్థులు

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో సోమవారం 2008–09 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు చదువులతల్లి సరస్వతిదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అర్చకుడు అప్పస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, సిబ్బంది, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

### సంతాపం


ముద్దనూరు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమాదేవికి రెవెన్యూ సిబ్బంది సంతాపం ప్రకటించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి సమీపంలో కారు ప్రమాదంలో రమాదేవి దుర్మరణం చెందారు. సోమవారం స్థానిక తహసీల్దారు వరదకిషోర్‌రెడ్డి, తమ సిబ్బందితో కలిసి కార్యాలయంలో రమాదేవి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ.. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. గతంలో ముద్దనూరు తహసీల్దారుగా ఆమె పనిచేశారని తెలిపారు.

### నేడు ప్రార్థనా సదస్సు

కడప కల్చరల్ : నగరంలోని పాత బైపాస్ వద్ద గల కృష్ణా కల్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం 6.00 గంటలకు కల్వరి టెంపుల్ ఆధ్వర్యంలో ప్రార్థనా సదస్సును నిర్వహించనున్నట్లు డాక్టర్ పి.సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# మట్టి కుండలో నీరు.. ఎంతో హుషారు

ఇప్పుడైతే నీటిని నిల్వ చేసుకోవడానికి రకరకాల పాత్రలు, స్టీల్, ప్లాస్టిక్ బిందెలను ఉపయోగిస్తున్నారు. కానీ ఒకప్పుడు అందరూ నీటిని మట్టికుండలలోనే నిల్వ చేసుకునేవారు. కానీ నేటి ఆధునిక ప్రపంచంలో మట్టి పాత్రల వినియోగం తగ్గింది. అయితే మట్టి కుండలో నీటిని తాగితే మంచిదని, రక్త ప్రసరణ పెరిగి ఉత్సాహంగా ఉంటారని వైద్యులు చెబుతున్నారు. దీనికితోడు మండుతున్న వేసవిలో కుండలోని నీటిని తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో పేదోడి ఫ్రిజ్‌కి డిమాండ్ పెరిగింది.



- పేదోడి ఫ్రిజ్‌కు గిరాకీ
- వేసవి దృష్ట్యా కొనేందుకు మొగ్గుచూపుతున్న ప్రజలు
- ఆరోగ్యంపై దృష్టి, జోరుగా అమ్మకాలు

కొండాపురం: ఎండ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. రోజురోజుకు ఉక్కబోత తీవ్రరూపం దాలుస్తోంది. దీంతో ప్రజలకు ఊపిరి ఆడటంలేదు. ఒక్కసారిగా ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతుండడంతో ప్రజలు బయటకు రావడానికి సాహసం చేయడం లేదు. భానుడు తన ప్రతాపాన్ని చూడటంతో బిందెలో నీరు ఎంత తాగిన దాహం తీరని పరిస్థితి. దీంతో పేదవాడి ఫ్రిజ్‌గా పిలువ బడే మట్టికుండలకు డిమాండ్ బాగా పెరిగింది. చల్లటినీటి కోసం మట్టి కుండలను ఆశ్రయిస్తున్నారు. ఒకప్పుడు ఇంట్లో చేసే వంటలకు మట్టి పాత్రలనే ఉపయోగించేవారు. దీంతో ప్రజలు ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు. అదేవిధంగా మట్టి కుండలను కేవలం వేసవి కాలంలో మంచినీరు తాగేందుకు మాత్రమే ఉపయోగిస్తున్నారు.

**వేసవిలో కుండ నీటికే మొగ్గు**

పేదోడి ఫ్రిజ్‌గా పిలవబడే మట్టికుండలో నీటిని తాగేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. ఇన్నాళ్లు ఫ్రిజ్ నీళ్లకే అలవాటు పడినప్పటికీ.. వేసవిలో మాత్రం కుండనీటికి మొగ్గు చూపుతున్నారు. వివిధ పనులపై బయటకు వెళ్లి ఇంటికి చేరిన ప్రజలు దాహం నుంచి ఉపశమనం పొందేందుకు చల్లటి కుండలో నీటినే తాగుతున్నారు. ఇంట్లో ఫ్రిజ్ ఉన్నప్పటికీ కుండలను కొనుగోలు చేస్తున్నారు. మట్టి కుండల సైజును బట్టి రూ.200 నుంచి రూ.400 వరకు విక్రయిస్తున్నారు. వేసవిలో వీటికి మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉంది.

**అదరణ కోల్పోయిన మట్టిపాత్రలు**

నేటి సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో మట్టిపాత్రల వినియోగం కనుమరుగవుతోంది. ఈ క్రమంలో గ్రామాల్లో కుమ్మరి కులస్తులకు చేతినిండా పని లేకుండా పోయింది. నేటి ఆధునిక కాలంలో స్టీల్ పాత్రలు, రైస్ కుక్కర్లు, తదితర పాత్రల్లో మాత్రమే ప్రజలు వంట చేసుకుంటున్నారు. దీంతో అనేక రుగ్మతలకు లోనవుతున్నారు. అయితే, మళ్లీ నాటి మట్టి పాత్రలపై వైపే ప్రజలు మొగ్గుచూపుతున్నారు. దీంతో మట్టి పాత్రలకు క్రేజ్ పెరిగింది. నేటి యాంత్రిక జీవనంలో ప్రతీ మనిషి ఏదో ఒక రోగంతో బాధపడుతున్నాడు. ఇలాంటి సమయంలో మట్టి వంట పాత్రల్లో వండుకొని తింటే ఆరోగ్యంగా ఉండగలుగుతారని పలువురు నిపుణులు తెలుపుతుండటంతో ప్రజలు వాటిని కొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. మరోవైపు కుండలకు మార్కెట్‌లో మంచి ధర ఉన్నా వాటిని తయారు చేసేందుకు ఖర్చు ఎక్కువగా అవుతోందని కుమ్మర వృత్తిదారులు చెబుతున్నారు. కుండలు తయారు చేసేందుకు కుటుంబమంతా కష్టపడాలని పేర్కొన్నారు. అయినా చేసిన పనికి ఫలితం దక్కడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం కులవృత్తులపై ఆదారపడే వారిని ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

# వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకం



మాట్లాడుతున్న రహంతుల్లా ఖాన్, నాయకులు

వేంపల్లె : వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమని వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షులు మునీర్, సోషల్ మీడియా మండల కన్వీనర్ రహంతుల్లా ఖాన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం తెలపడం రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగం ప్రకారం దేశంలోని అన్ని మతాలకు సమాన చట్టంగా వర్తిస్తుందన్నారు. కానీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకనుగుణంగా వ్యవహరించడం చాలా దారుణమన్నారు. వక్ఫ్ ఆస్తులకు 1995లోనే కేంద్ర ప్రభుత్వం చట్టం చేయడం జరిగిందని, ఆ చట్టానికి తూట్లు పొడుస్తూ ముస్లింల మనోభావాలు దెబ్బతీసే విధంగా అర్ధరాత్రి చట్టాలు చేయడం బీజేపీకే చెల్లిందని మండిపడ్డారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు టీడీపీ, జనసేన పార్టీలు మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. చెప్పిన మాట ప్రకారం వక్ఫ్ బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన వైఎస్సార్‌సీపీ, పార్లమెంటు సభ్యులకు. మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డిని ముస్లిం సమాజం అభినందిస్తోందని తెలిపారు. మండల ఉపాధ్యక్షులు మునీర్, వైస్ ఎంపీపీ బాబా షరీఫ్, సోషల్ మీడియా మండల కన్వీనర్ ఖాన్, ఎంపీటీసీ హబీబ్, మైనారిటీ నాయకులు నిషార్, ఖదిరుల్లా తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రియ ఉత్పత్తులతోనే ఆరోగ్య రక్షణ



ఆర్గానిక్ కూరగాయలను విక్రయిస్తున్న రైతులు

పులివెందుల రూరల్ : సేంద్రియ సాగుతో పండించే ఆహార ఉత్పత్తులతోనే మానవాళికి ఆరోగ్య రక్షణ అని మెప్మా అధికారులు శ్రీనాథ్ రెడ్డి, నాగలక్ష్మి అన్నారు. పట్టణంలోని స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలోని మెప్మా కార్యాలయంలో సోమవారం ఆర్గానిక్ కూరగాయల ప్రదర్శనను నిర్వహించారు. ఇ.కొత్తపల్లె గ్రామ నుంచి యామిని లత, అక్కులగారిపల్లె నుంచి ఉదయ్‌కృష్ణారెడ్డి, యశోద, చిన్నకుడాల నుంచి జయలక్ష్మి, నాగేంద్రమ్మ, శోభ, తదితరులు సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలను ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆర్గానిక్ పద్ధతిలో పండించిన కూరగాయలను మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు విక్రయిస్తున్నామని పేర్కొన్నారు. కిలో బెండకాయలు, కిలో మొటిక్కాయలు, కిలో క్యారెట్‌లను రూ.40ల చొప్పున విక్రయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి



సీఐ చాంద్ బాషా



సీఐ నరసింహులు

పులివెందుల రూరల్ : అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పులివెందుల అర్బన్ సీఐ చాంద్ బాషా పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న నరసింహులు వేంపల్లెకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కడప క్రైమ్ బ్రాంచ్‌లో సీఐగా పనిచేస్తున్న చాంద్ బాషా పులివెందుల అర్బన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ చాంద్ బాషా మాట్లాడుతూ పులివెందుల మండల పరిధిలో ఎక్కడైనా మట్కా, జూదం, గ్యాంబ్లింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే మండల పరిధిలో ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

**అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు**

వేంపల్లె : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నరసింహులు పేర్కొన్నారు. బదిలీల్లో పులివెందుల సీఐగా పనిచేస్తున్న టి.నరసింహులు వేంపల్లెకు బదిలీపై వచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం వేంపల్లె సీఐగా టి.నరసింహులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని, మట్కా, జూదం లాంటి జోలికి వెళ్ళితే జీవితాలు నాశనమవుతాయన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

### పన్నులు చెల్లించి రాయితీ పొందండి

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి పన్నులు, ఖాళీ జాగా పన్నులను ఈ నెలాఖరులోపు చెల్లించి 5 శాతం రాయితీ పొందవచ్చునని మున్సిపల్ కమిషనర్ రాముడు పట్టణ ప్రజలకు సూచించారు. సోమవారం ఆయన తెలుపుతూ 2025–26 సంవత్సరానికి చెల్లించాల్సిన ఇంటి పన్నులు, ఖాళీ జాగా పన్నులు ఏక మొత్తంలో చెల్లించి రాయితీ పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు వినియోగించుకుని వార్డు సచివాలయంలో కానీ, మున్సిపల్ కార్యాలయంలోని కౌంటర్‌లో పన్నులు చెల్లించాలన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

### వెలుగు సీసీ వేణుగోపాల్‌రెడ్డి మృతి



వేణుగోపాల్‌రెడ్డి (ఫైల్)

కొండాపురం: కొండాపురం మండలంలోని వెలుగు కార్యాలయంలో సీసీ ఉద్యోగిగా పనిచేస్తున్న భూమిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి (52)సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. బంధువుల వివరాల మేరకు.. గత కొద్దిరోజులుగా వేణుగోపాల్‌రెడ్డి కిడ్నీవ్యాధితో బాధపడుతూ మృతి చెందారు. వెలుగు సిబ్బంది బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు.

# సీఎంఆర్‌ఎఫ్‌తో కుటుంబానికి ఆసరా



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

వేంపల్లె : బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఆసరాగా ఉంటుందని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక సంఘం వీధిలో నివాసముంటున్న నామా శ్రీనివాసులు ఇంటికి ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి విచ్చేశారు. అనంతరం నామా శ్రీనువాసులు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన (ఎల్ఓసీ)కు చెందిన రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆరోగ్యం కోసం డబ్బులు ఖర్చు చేసుకున్న బాధితులు కార్పొరేట్ ఆసుపత్రిలో ఇచ్చే బిల్లులను జాగ్రత్తగా తీసుకుని వచ్చి సీఎంఆర్‌ఎఫ్ కింద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# ప్రమాదంలో అంగన్వాడీ కోడగుడ్లు నేలపాలు

ముద్దనూరు : అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్లను సరఫరాచేసే లారీ ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కోడిగుడ్లు పగిలిపోవడంతో నష్టం వాటిల్లింది. బాధితుల సమాచారం మేరకు బళ్లారి నుంచి నెల్లూరు జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్లను సరఫరా చేసేందుకు లారీ కోడిగుడ్లతో ప్రయాణిస్తోంది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ముద్దనూరులోని జమ్మలమడుగు బైపాస్ రహదారి వద్ద స్పీడ్ బ్రేకర్ వద్దకు లారీ రాగానే వెనుక వైపు నుంచి వస్తున్న మరో లారీ కోడిగుడ్ల లోడుతో వెళ్తున్న లారీని ఢీకొంది.

దీంతో ప్రమాదానికి గురైన లారీలో నుంచి కోడిగుడ్లు నేలపాలయ్యాయి. లారీలో సుమారు రూ.1లక్షా 50వేల విలువైన కోడిగుడ్లు ఉన్నాయని, ప్రమాదంలో ఆర్థిక నష్టం వాటిల్లిందని లారీ డ్రైవర్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

# ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

ఎర్రగుంట్ల : ప్రజా సమస్యలపై నిరంతర పోరాడుతామని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఈర్లముతక శరత్ తెలిపారు. యర్రగుంట్ల పట్టణం కడప రోడ్డులో ఉన్న మార్క్స్ భవన్‌లో సోమవారం ఏఐవైఎఫ్ జాతీయ 17వ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనెల 15వ తేదీన తిరుపతిలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. దేశంలో అత్యధికంగా దాదాపు 65 శాతం యువత ఉందని, అయితే యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నాయని అన్నారు.

# సచివాలయ సిబ్బందికి అందని జీతాలు

వేంపల్లె : వేంపల్లె మండలంలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న గ్రామ సచివాలయ సిబ్బందికి జీతాలు రాలేదు. దీంతో గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది జీతాలు కోసం ఎదురు చూస్తున్నారు. వేంపల్లె పరిధిలో ఉన్న 8 గ్రామ సచివాలయాల్లో 70 మంది సిబ్బంది పని చేస్తున్నారు. వీరందరికీ మార్చి నెలకు సంబంధించిన జీతం మంజూరు కాలేదని గ్రామ సచివాలయ సిబ్బంది వాపోతున్నారు. వేంపల్లె పరిధిలో ఉన్న గ్రామ సచివాలయ సిబ్బందికి వేంపల్లె మేజర్ పంచాయతీ కార్యదర్శి హెడ్‌గా ఉన్నారు. గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి ఉన్నతస్థాయి అధికారి అయిన పంచాయతీ కార్యదర్శి జీతాలను ప్రతినెలా చెల్లించడం జరిగితే, అయితే వేంపల్లె పంచాయతీ కార్యదర్శిగా ఉన్న సుబ్బారెడ్డిని సస్పెండ్ చేయడంతో ఆయన స్థానంలో ఈఓగా ఏ అధికారి రాలేదు. దీంతో గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు చేసేందుకు వీలు లేకుండాపోయింది. సోమవారం ఎంపీడీఓను గ్రామ సచివాలయ సిబ్బంది కలిసి జీతాలు విషయంపై విన్నవించారు. జీతం రాక పోవడంతో సిబ్బందికి ఇబ్బందులు వస్తున్నాయని, కాబట్టి వెంటనే వేంపల్లె పంచాయతీకి కార్యదర్శిని నియమించి సకాలంలో గ్రామ సచివాలయ సిబ్బందికి జీతాలు వచ్చే విధంగా అధికారులు సహకరించాలని కోరారు.

# క్యాంప్‌బెల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ మార్పు




ఈ నిర్ణయం చెల్లదంటూ ఉద్యోగుల నిరసన

జమ్మలమడుగు: జమ్మలమడుగులోని క్యాంప్‌బెల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ అగస్టీన్ రాజును తొలగించడంతో ఆసుపత్రిలో రగడ మొదలైంది. ఉద్యోగులందరూ విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఆసుపత్రిలో రోగులను చూసేవారు కరువయ్యారు. దాదాపు 30 ఏళ్లుగా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా హెలెన్ డేవిడ్ బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చారు. అయితే ఆమె అనారోగ్యం పరిస్థితితో గతంలో ఆమె అల్లుడైన అగస్టీన్ రాజుకు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగించారు. అప్పటికే కంటి వైద్యుడుగా పేరు పొందిన రవీంద్ర కూడా ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం అగస్టీన్‌ను పక్కన పెట్టి ఆయన స్థానంలో సూపరింటెండెంట్‌గా కంటి వైద్యుడు రవీంద్రను నియమించడంతో ఆసుపత్రి సిబ్బంది ఒక్కసారిగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌ను మార్చేటప్పుడు డయాసిస్ అందరి నిర్ణయాలు తీసుకుని మార్చాలే తప్ప ఇలా ఏకపక్ష నిర్ణయం తగదంటున్నారు. నిర్ణయాన్ని మార్చుకోకపోతే నిరాహార దీక్షలు చేపడతామని ఉద్యోగులు హెచ్చరించారు.

**మేము ఎవ్వరిని తొలగించలేదు**

కాగా, సీఎస్ఐ క్యాంప్‌బెల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అగస్టీన్ రాజును తొలగించి డాక్టర్ రవీంద్రను నియమిస్తూ తాము ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని, సెంట్రల్ బోర్డు మినిట్స్‌లోగాని, అధీకృత ఉత్తర్వులు గాని ఇవ్వలేదని సీఎస్ఐ రాయలసీమ డయాసిస్ సెక్రెటరీ, సెంట్రల్ బోర్డు కార్యదర్శి హోదాలో సి.సాల్మోన్ పేరుతో ఒక ప్రకటన విడుదల కావడంచర్చనీయాంశంగా మారింది.



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

**మార్పు చెల్లదు**

ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను మార్చడం సరైంది కాదు. డయాసిస్‌లో ఓటింగ్ నిర్వహించిన తర్వాతే మార్పు జరుగుతుంది. అలా కాకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటే ఆసుపత్రి మనుగడ ప్రశ్నార్థకం అవుతుంది. కనీసం ఆసుపత్రి వైస్‌చైర్మన్‌గా ఉన్న నాకు కూడా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

–డాక్టర్ ప్రత్యూష, వైస్ చైర్మన్ , క్యాంప్‌బెల్ ఆసుపత్రి, జమ్మలమడుగు

**నాకు ఎలాంటి పత్రాలు అందలేదు**

ఆసుపత్రి సూపరింటెండెంట్ బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు నాకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. నన్ను తొలగించాలంటూ అడ్మినిస్ట్రేషన్ సెంట్రల్ బోర్డులో 35 మందితో కూడిన కమిటీ తీర్మానం చేయాలి. ఇంతవరకు ఎలాంటి తీర్మానం చేయలేదు. దీనిపై కడప కోర్టులో న్యాయ పోరాటం చేస్తాను. నేనే సూపరింటెండెంట్‌గా కొనసాగుతా.

అగస్టీన్ రాజు, సూపరింటెండెంట్, క్యాంప్‌బెల్ ఆసుపత్రి, జమ్మలమడుగు

**అన్ని పత్రాలతోనే బాధ్యతలు చేపట్టాను**

రాయలసీమ డయాసిస్ నన్ను క్యాంప్‌బెల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నియమించింది. దీనికి సంబంధించిన అన్ని పత్రాలు లీగల్‌గా ఉన్నాయి. కనుక నేను ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టాను.

డాక్టర్ రవీంద్ర, కంటి వైద్య నిపుణులు, క్యాంప్‌బెల్ ఆసుపత్రి, జమ్మలమడుగు

# ఆరోగ్యకర జీవనశైలితో సౌభాగ్య జీవితం



తొండూరు : అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య



చింతకొమ్మదిన్నె : ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు

చింతకొమ్మదిన్నె : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలో డాక్టర్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు రాఘవేంద్ర మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ప్రారంభం –ఆశాజనక భవిష్యత్ అనే థీమ్‌తో 2025 సంవత్సరంలో అందరూ ఆరోగ్య సూత్రాలు పాటించి ఆరోగ్యంగా ఉండాలని, సరైన వయసులో వివాహం –సంతోషానికి నిలయం, పోష్టికాహారం తల్లిబిడ్డ ఆరోగ్యానికి సోపానమని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య సిబ్బంది, సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థినులు, ప్రజలు పాల్గొన్నారు

తొండూరు : ఆరోగ్యకరమైన జీవితంతో మంచి భవిష్యత్ ఉంటుందని హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమైన తొండూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యకరమైన ప్రారంభం – ఆశాజనకమైన భవిష్యత్ అనే అంశంపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య సమాజంలో మాత, శిశు మరణాలు, పోషకాహార లోపం లేని సమాజం, పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమణమ్మ, ఆరోగ్య కార్యకర్తలు పుల్లమ్మ, శుక్రు, అంగన్‌వాడీ కార్యకర్త గురుతేజ, కుమారి, ఆశా కార్యకర్త, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ముద్దనూరు: సమాజంలోని ప్రతి వ్యక్తి ఆరోగ్యకరమైన జీవితంపై అవగాహన పెంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధవహించాలని సూచించారు.

**ర్యాలీ**

పెండ్లిమర్రి: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం నందిమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడు వినయ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు, నవజాతు శిశువుల ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలన్నారు. మాతా శిశు సంరక్షణ పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ రామప్రతాప్, వైద్యసిబ్బంది సౌజన్య, నీరజ, అంజన పాల్గొన్నారు.

**పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం**

ఎర్రగుంట్ల : ప్రతి ఒక్కరూ పోషణతో కూడిన ఆహారం తీసుకోవాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని చిలంకూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గణేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా చిలంకూరులో అవగాహన ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని తెలిపారు. సరైన వయస్సులో వివాహం– సంతోషానికి నిలయం, పౌష్టికాహారం తల్లిబిడ్డ ఆరోగ్యానికి సోపానం, ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు తల్లిబిడ్డకు ఆరోగ్యకమని ర్యాలీలో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




పెండ్లిమర్రి: నందిమండలంలో..



ఎర్రగుంట్ల: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది